

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 15 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'కష్టేవిణ ఫలనాహిం కష్టేం విణ రాజ్య నాహీం

ఆధింకష్టాచే దుఃఖసోసితీ తే పుఢేం సుఘాచేం ఫలభోగితీ'..

కష్టము లేకుండా ఫలితము లేదు, కష్టము లేకుండా రాజ్యమూ లేదు. ముందుగా ఎవరైతే కష్టాలలో, దుఃఖాలతో అలిసిపోతారో వారే పిదప సుఖఫలితాన్ని అనుభవిస్తారు. గోపాబా! మీకు తెలియనిదా? రామదాస సామ్రాజ్యము ఎన్ని కష్టాలననుభవిస్తే దక్కుతుంది. సంకీర్తన అనంతరం సమర్థ రాముడు పలికిన పలుకులు చెవులలో ప్రతిధ్వనిస్తున్నాయి నిదుర పట్టని గోపన్న చెవులలో.

బురుజులమీద కావలివారు తిరుగుతున్న అలికిడి వినిపిస్తున్నది. పగలల్లా స్వేచ్ఛగా యేభయమూ లేకుండా రాసుకుని తిరిగిన పెంపుడు నెమళ్ళు మునగదీసుకుని పడుకుని మధ్యమధ్య చేస్తున్న ధ్వనులు వినిపిస్తున్నాయి. చిరుగాలులకు ఆకులు చేస్తున్న సన్నని సవ్వడులు మృదువుగా సంగీతం వినిపిస్తున్నాయి. అల్లంత దూరంలో యోగులకు యోగ్యమైన శయ్యమీద సమర్ధరాముడు నిదురిస్తున్నాడు ప్రత్యేకముగా ఆ సాయంత్రము వేసిన కుటీరములో. ఒక మాసము వారి మకాము అక్కడేనట! ఆయనకు రెండు ధనువుల దూరంలో నలుదిక్కులా నలుగురు శిష్యులు పడుకున్నారు. సేవకోసం మాత్రమే కాదు, రక్షణగా కూడా. ఉత్తి చేతులతో ఒక్కొక్కరూ నలుగురిని నిలువరించగలిగిన సాహసికులు, వీరులు వారు. ఒక్క గట్టి కర్ర చేతికి దొరికిందా, పదిమందిని పరుగులు పెట్టించగల సమర్థులు వారు, సమర్ధరాముడి శిష్యులు కదా!

సామాన్యంగా గృహస్థుల యిళ్ళకు వెళ్ళడు సమర్ధరాముడు. వెళ్ళినా భిక్ష మాత్రమే స్వీకరించి వెళ్తారు. ఛత్రపతి అంతటివాడు పోరగా పోరగా వేళ్ళమీద లెక్కబెట్టగలిగినన్ని పర్యాయాలు మాత్రమే ఆయన రాజప్రాసాదానికి వెళ్ళాడు. యిప్పుడు ప్రత్యేకమైన రాజకార్యముమీద ఉన్నాడాయన.

ఛత్రపతి దక్షిణానికి దృష్టిసారించాడు. శరన్నవరాత్రి ఉత్సవాలు దివ్యముగా జరిపించి, తుల్జాపూరు భవానీ దర్శనం చేసుకుని, ఆమె ఆశీస్సులు అందుకున్నాడు. గత విజయదశమినాడే, అక్టోబర్ పదహారవ తారీఖు,1676 శుక్రవారమునాడు దక్షిణానికి ఉత్సాహంతో బయలుదేరాడుట శివాజీ మహారాజు. మూడు మాసాలుగా యుద్ధాలు, విజయాలు, పుణ్యక్షేత్ర దర్శనలు చేసుకుంటూ ముందుకు సాగుతున్నాడు. గోల్కొండ యాత్రకు తేదీ కూడా నిర్ణయింపబడింది, కానీ యింకా రహస్యంగానే ఉంచబడింది. సాయంకాలపు రామసేవ ముగిసిన అనంతరం ఛత్రపతి రాక జరుగుతుందా అని కృష్ణరాయలు కుతూహలంగా ప్రశ్నించినపుడు ఈ విషయాలను స్వయంగా చెప్పాడు సమర్ధరాముడు.

పెరిగిన బిడ్డడు నూతన విజయాలకోసం ముందుకు వెళుతున్నప్పుడు అడ్డు చెప్పకుండా, తానే కష్టపడి ఫలితాన్ని అందించకుండా, పరిశీలిస్తూ, పర్యవేక్షిస్తూ తెరవెనుక ఉండి కనిపెట్టి కాపాడే తండ్రిలాంటివాడు సమర్ధరాముడు. శివాజీ ప్రయత్నాలు ఫలించే బీజాలు వేయడానికి, శత్రువుల కదలికలు కనిపెట్టి కట్టడిచేయడానికి మరలా దక్షిణానికి బయలుదేరాడు తనుకూడా. గతములో ఒకసారి దక్షిణాపథాన్ని మొత్తమూ చుట్టబెట్టాడు ఆయన. కన్యాకుమారివరకూ ప్రతిచోటా మఠాలను ఏర్పాటు చేశాడు, కొన్నిచోట్ల రహస్యముగా, కొన్నిచోట్ల అందరికీ తెలిసేలా. ఆయన మఠమో, అనుయాయులో, గూఢచారులో లేని పట్టణమే లేదు యావద్భారతంలో. ఆయనకు తెలియని అరణ్య, నదీ, పర్వత పృథ్వీమార్గాలే లేవు. ఆ బలముతోనే, ఆ యంత్రాంగముతోనే ఢిల్లీలో కన్నుగప్పి మాయమైన శివాజీ చిరునవ్వు చెదరకుండా తన అంతఃపురానికి చేరుకున్నాడు. సమర్ధరాముడు పరతత్త్వ సేవలో ఉన్నపుడు ఒక బ్రహ్మర్షి. రాజ్యాంగతంత్ర రచనలో, సుస్థిర హైందవ సామ్రాజ్య స్థాపనలో ఒక రాజర్షి. పవిత్రతలో, సాధనలో, భక్తిలో దేవర్షి. భరతమేదినిలో ఆయనవంటివాడు ఆయనే, వేరెవరూ లేరు! ఆలోచనల వీచికలలో ఊయలలూగుతూ మనసులోనే నమోవాకాలు సమర్పించాడు గోపన్న. మరలా తనను పట్టిపీడిస్తున్న వేదనవైపుకు మరలింది గోపన్న మనసు.

ఎంతటి నిర్దయుడవైపోయావు రామచంద్రా! చివరకు తానీషా నీ దర్శనానికి నోచుకున్నాడే, నేనేం పాపం చేశాను? నీ సుందర రూపాన్ని చూపించి, జీవితాంతమూ నీకు చెరసాలయే గతి అని చెప్పినా నా భాగ్యానికి మురిసిపోయే వాడినే! నాకన్నా ఆ తానీషా ఎంత అదృష్టవంతుడు! యివే ఆలోచనలు ఆయనను నలిపివేస్తున్నాయి గత షుమారు పక్షం రోజులుగా.

తెల్లవారుజామున చెరసాల తలుపుతీసి, ' మీ బాకీ ఎవరో యిద్దరు రాకుమారులు చెల్లించారుట తానీషావారికి. రశీదు కూడా పుచ్చుకుని వెళ్ళారుట. సగౌరవంగా మిమ్ములను పాలవంచకు పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయి' అని సిపాయీ అంటుంటే సంభ్రమంతో ఉదుటున లేచాడు తను. పక్కగా రాతిగద్దెమీద పరిచిన చిరుగుల కంబళి చెదిరి, పాదుషా స్వహస్తాలతో దస్తఖత్ చేసి, రాజముద్ర వేసిన రశీదు కంబళి కింద కనిపించింది.

రామోజీ, లక్ష్మోజీలకు తానీషా యిచ్చిన రశీదు, ఎంత మోసం! రామ లక్ష్మణులే వారు అని తెలుసుకుని తను బావురుమన్న సంగతి గురుతుకొచ్చింది. బాధగా తల విదిలించాడు.

ఆ దుఃఖము మరలా తన్నుకొచ్చింది. నిదుర పట్టిందో, ఆర్తితో బాహ్యప్రపంచాన్ని విస్మరించాడో తెలియదు ఆయనకు, కనురెప్పలనుండి జాలులై, చెవిదొప్పలు నిండి తలగడను తడిపిన కన్నీటి చెమ్మ లీలగా తెలుస్తున్నది ఆయనకు. ఒక దివ్యసుందర రూపం కనులకుకనిపించింది. పోల్చిచెప్పడానికి వీలుగాని తీయని కంఠం ఒకటి వినిపించింది. ఒక కథ చెప్పడం ప్రారంభించింది ఆ మూర్తి. తను వింటున్నాడు.

## - 16 –

'హారా హుషార్..హారా హుషార్..హారా హుషార్' అని మూడో ఝాము హెచ్చరికలు కోటబురుజులనుండి వినిపించాయి. మూడోఝాముకు వంతులు మారుతాయి, అంతవరకూ రెండుఝాములపాటు కావలి కాసిన వారు దిగిపోతారు. ఝాము ఝాముకూ హెచ్చరికలు చేసే కంఠస్వరం మారిపోవడంతో కొత్తగొంతు వినబడి, చప్పున మెలకువ వచ్చింది గోపన్నకు. సమర్ధరాముడి సన్నిధిలో నిదురించాలనే కోరికతో తనూ కుటీరములోనే కంబళి పరుచుకుని పడుకున్నాడు. ఎంతోసేపు ఆలోచనలతో సతమతమై నిదురించిన తరువాత స్వప్నపు తెర తొలగిపోయి లేచికూర్చున్నాడు.

గగన మధ్యం నుండి పడమరకు సగం సాగిన చంద్రుడు చల్లని వెన్నెల కురిపిస్తున్నాడు. గిలిగింతలు పెట్టే చిరు చలిగాలులు వీస్తున్నాయి. దూరాన కోటబురుజులమీద కావలివాని తలమీద తెల్లగొడుగులా కనిపించింది చంద్రబింబం. చుక్కలను పిండికొట్టి రాల్చినట్లు తోటలోని వృక్షాలు తెలతెల్లగా కనిపిస్తున్నాయి. కృష్ణరాయల సౌధం వెన్నెల కాంతిలో తెల్లని కొండలా కనిపిస్తున్నది. ఎడమ భుజంమీదికి ఒత్తిగిల్లి నిదురిస్తున్న సమర్ధ రాముని విశాలమైన భుజములమీద నడుముమీద పిరుదులమీద ఏటవాలుగా వెన్నెల పడి మెరుస్తున్నది. దీర్ఘమైన ధనుస్సులా కనిపించింది ఆ ఆకారం. కలలో కనిపించిన ధనుస్సు, ఆ వింటినారి చేసిన ధ్వని, ఆ విల్లును పట్టుకుని కొంటె నవ్వులు నవ్వుతూ ఒక గండశిలమీద కూర్చున్న గొల్లపిల్లడు గుర్తుకొచ్చారు. అంతలో దూరంగా, యింతలోనే దగ్గరగా గోవులు కనిపించి దూరాల పచ్చిక బీళ్ళలో కరిగినట్టు మాయమవడం మరలా కనులముందు మెదిలింది. ఆ పిల్లాడి చేతిలో గోవులను అదిలించే బెత్తంలా ఒకసారి, అంతలోనే పదునైన బాణంలా ఒకసారి మెరిసిన వెదురు గుర్తుకొచ్చింది. కిలకిల నవ్వి, దిగులెందుకు గోపన్నా? హాయిగా నవ్వరాదూ! ఒక కథ చెప్పనా పోనీ, 'అనగనగా..' ఆ పలుకులు మళ్ళీ గుర్తుకొచ్చాయి.

యింకా ఆ కలలోనే సగంశరీరము మనసు ఉండిపోయి, మత్తుగా అనిపించింది ఆయనకు. మెల్లగా కనులు తెరిచి లేచి కూర్చుని దక్షిణ హస్తాన్ని దర్శించి, చిరునవ్వులు చిందిస్తూ తననే చూస్తూ సమర్ధరాముడు కనిపించాడు. 'జై శ్రీరాం! కథ బాగుందా గోపాబా? కథకుడు బాగున్నాడా?' అని సమర్ధరాముడు చిలిపిగా అడగడంతో పూర్తిగా ఈలోకంలోకి వచ్చాడు గోపన్న.

అబ్బురపాటుతో 'జై శ్రీరాం!' అని తనూ నినదించి ఆయనకు నమస్కరించాడు కూర్చున్నచోటినుండే. కలలో కథ, కథకుడు, ఎలా తెలిసింది ఈయనకు? ఈయన చూడలేనిది లేదా? అనుకున్నాడు తనలో తనే. ముసిముసి నవ్వులు నవ్వుతూ..

'దాస్ డోగరీం రాహాతో యాత్రా దేవాచీ పాహాతో

దేవభక్తా సర్వేం జాతో ధ్యానరూపేం' అన్నాడు సమర్ధరాముడు.

తనే అందుకుని మళ్ళీ ' సమర్ధరామదాసు పర్వతములందు ఉంటాడు. అక్కడినుండే పల్లెపల్లెలో ఊరేగే శ్రీరాముని దర్శిస్తాడు. రఘువీరుడు ధ్యానరూపముతో తన భక్తులతో కలిసి నా ఉత్సవాలలో ఉంటాడు'

'యిది శుభోదయం గోపన్నా! రఘువీరుడే రామునిగా కృష్ణునిగా నీ స్వప్నంలో సాక్షాత్కరించాడు. ఒక్క రాముడినే చూడాలనుకున్నావు కదూ, యిద్దరిగా కనిపించాడు చూశావా ఎంత దయాళువో!'

'ఈ తానీషా గత జన్మలో వీరశైవుడు! శివుని సాక్షాత్కారం కోసం శివవ్రతం సంవత్సరకాలం చేయాలని వ్రతదీక్ష చేపట్టాడు. ఒకరోజు ముందుగా ముగించిన కారణంగా వ్రతభంగ దోషంతో మరలా యిలా జన్మించాడు! అచంచలమైన భక్తి కారణంగా శివుని ఉపాస్య దైవమే ఆయనకు కనిపించి కరుణించాడు'

ఊపిరి తీసుకోవడం కూడా మరిచినట్లు నిశ్చలుడై వింటున్నాడు గోపన్న. ఆ సరికి తామూ మేలుకుని గురుదేవునిచుట్టూ చేతులుకట్టుకుని చేరిన శిష్యులు కూడా శ్రోతలైనారు. కలలో తను విన్న కథను క్లుప్తంగా ఆయన దర్శించినట్టు చెబుతుంటే ఆయన పాదాలకు నమస్కరించబోయాడు గోపన్న. వారించాడు సమర్ధరాముడు.

గోపన్నను వాత్సల్యముతో చూస్తూ ' రామదాసశ్రేష్ఠా! నీ ఖైదుకు అప్పుడు గోల్కొండ పాదుషాగా ఉన్న ఈతడి మామ 'అబ్దుల్లా కుతుబ్ షా' బాధ్యుడు. సుల్తానుకు ముద్దుల అల్లుడిగా, కాబోయే సుల్తానుగా, ఆనాడే నిన్ను కాపాడగలిగిన పలుకుబడి ఉండీ ఈ తానీషా ఉపేక్షించాడు. పరోక్షంగా నీ పన్నెండు సంవత్సరాల జైలు శిక్షకు నిమిత్తుడు ఐన కారణంగా, తనూ ఖైదులోనే పన్నెండు సంవత్సరాలు కృశించి తనువును విడిచిపెడతాడు. పాపక్షయం అయినందున శివైక్యం చెందుతాడు, ధన్యుడు!' అన్నాడు.

అప్పుడప్పుడే లేతఎరుపురంగును పులుముకుంటున్నది ఆకాశం. క్రమక్రమంగా పసుపు వన్నెను, తెల్లనిరంగును సంతరించుకుంటున్నది. చల్లని ప్రభాతవాయువులు శరీరాలు పులకించేలా వీస్తున్నాయి. బురుజులపై జెండాలు నర్తకీమణుల హస్తవిన్యాసాలలా అలలుగా కదులుతున్నాయి. గోశాలలో తలలెత్తిన గోవులు మువ్వలు ఘల్లుమనేలా ఒళ్ళు విదుల్చుకుంటున్నాయి. దూడలు మరింతగా తల్లుల డొక్కలలోకి దూరి మునగదీసుకుంటున్నాయి. క్రమంగా వెలుగురేఖలు చిమ్మడానికి బాలభానుడు ప్రయత్నిస్తుంటే పొగమంచు పరదాలు కమ్మడానికి పోటీ పడుతున్నది వెళ్ళిపోతున్న హేమంతం. కుటీరపు అంచులనుండి ఒక్కొక్కబొట్టుగా వుండీ వుండీ మంచు బిందువులు కురుస్తున్నాయి. సమర్ధరాముని గంభీరమైన పలుకులనే వింటున్న శ్రోతల ఆకారాలు ఇప్పుడిప్పుడే స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మహా సాధకుడు, సూఫీ సాధువు 'హజ్రత్ షా రాజు కట్టల్' ఈతనికి గురువు. ఆ మహానుభావుడు 'జావియా'లో మూడు రోజులు మౌనంగా 'ధిక్రో' చేస్తూ మంత్రించిన దానిమ్మ పండును అబుల్ హసన్ తానీషాకు ప్రసాదంగా యిచ్చాడు. తానీషా కేవలం పద్నాలుగు గింజలను మాత్రమే తిన్నాడు. కనుక పద్నాలుగు సంవత్సరాలు మాత్రమే యితడు ప్రభువుగా ఉంటాడు. ఆ పండును మొత్తాన్నీ ప్రసాదంగా తిని ఉంటే ఎన్ని గింజలు అందులో ఉన్నాయో అన్ని సంవత్సరాలు యితడు, అనంతరం యితని వారసులు గోల్కొండను పాలించేవారు. కుతుబ్ షాహీల పరిపాలన ఈతనితో అంతరించిపోతుంది. అంతా ఈశ్వరుని లీల! అన్నాడు.

'రాత్రి భూతల శయనం జరిగింది, స్వామి దర్శనం అయ్యింది, ఆజ్ఞ లభించింది, నీకు రామతారకం లభించబోతున్నది! శుచివై నిత్య పూజావిధులు నిర్వర్తించుకుని రా తండ్రీ' అన్నాడు ప్రేమగా! గోపన్న మేను పులకించింది. వినయంగా తలవంచి నమస్కరించి చిత్తం అన్నట్లు తల పంకించాడు. దూరంగా గ్రామీణుల గుడిసెల మీదినుండి కోళ్ళకూతలు ఉషోదయాన్ని ప్రకటించాయి. యింతలోనే గ్రామపు నడిబొడ్డున ఉన్న దేవాలయపు ఘంటలు శుభమ్మని, కమ్మని ధ్వనులను పంచాయి!

(కొనసాగింపు వచ్చే సంచికలో..)